సాక్షి మంచిర్యాల

శనివారం : 26 : ఏప్రిల్ : 2025



ఈ స్టేషన్‌లో రైళ్లు ఆగవు

సింగరేణి పారిశ్రామిక ప్రాంతం మందమర్రిలోని రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్టింగ్ కరువైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. IIలో▸



సీపీవోగా పూర్ణచంద్రరావు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో)గా వీ.పూర్ణచంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'మాదీ సైట్ బ్యాచే.. అన్నకు ఫోన్ చేయాలా?'



గొడవ పడుతున్న యువకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'మాది కూడా సైట్ బ్యాచ్. అన్నకు ఫోన్ చేయాలా?' అంటూ ఇరువర్గాలు ఘర్షణ పడిన తీరు అక్కడున్న వారిని ఆశ్చర్యపోయేలా చేసింది. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రం ఐబీ చౌరస్తా వద్ద ఓ హోటల్ పక్కనే ఉన్న పాన్‌షాపు యజమానికి మరో ఇద్దరికి స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ వ్యక్తి నగదు ఇచ్చినా ఇవ్వలేదనే షాపు నిర్వాహకుడు చెప్పగా, ఇద్దరి మధ్య ఈ విషయంలో ఒకరిపై ఒకరు మాటామాట పెరిగేలా చేసింది. మద్యంమత్తులో ఉన్న ఇద్దరు యువకులు షాపు అతని దగ్గరిగా వస్తూ 'మాది సైట్ బ్యాచ్, అన్నతో మాట్లాడాలా?' అంటూ బెదిరించసాగారు. అయితే అక్కడున్న మరొక వ్యక్తి 'మేం కూడా సైట్ బ్యాచే. మేం కూడా అన్నతో మాట్లాడుతాం. ఎవరికి ఫోన్ చేయాలే, నేను మాజీ కౌన్సిలర్‌ని' అంటూ గొడవ పడడం అక్కడున్నవారిని ఆశ్చర్యపడేలా చేసింది. ఇరువర్గాలు ఆ 'బ్యాచ్' పేరు చెబుతూనే కాసేపు వాదించుకుని వెళ్లిపోయారు. జిల్లా కేంద్రంలో సైట్ బ్యాచ్ పేరుతో యువత, గ్యాంగ్‌లను పెంచిపోషిస్తూ చట్టవ్యతిరేక సెటిల్మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా గొడవ జరిగితే ఆ బ్యాచ్ పేరు చెబితే సామాన్యుల్లో భయం ఉంటుందనే కోణంలో ఆ పేరే వాడుకుంటున్నారు. గతంలో ఇదే షాపు వద్ద గొడవ జరగడం గమనార్హం.

28 నుంచి రాష్ట్రస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న రమేష్

మందమర్రిరూరల్: ఈ నెల 28, 29, 30వ తేదీల్లో మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో రాష్ట్రస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున 20 మంది ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన జట్టు గుజరాత్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి రమేష్‌రెడ్డి, కోచ్ అరవింద్ పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి



అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో మలేరియా వ్యాధి రాకుండా అరికట్టి, మలేరియా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నగరంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో దోమలు పెరగకుండా చూడాలని, 2030 నాటికి దేశవ్యాప్తంగా మలేరియా నిర్మూలనలో జిల్లాను భాగస్వామిగా చేయాలని అన్నారు. నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి చెందుతాయని, నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎస్.అనిత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, వైద్యులు శివప్రతాప్, అశోక్, సునిత, అమర్, రాము, రజిత, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సంతోష్, డెమో బుక్క వెంకటేశ్వర్, డీపీవో ప్రశాంతి పాల్గొన్నారు.

42కిలోలైతే ఓకే..!

- ధాన్యం దించుకునేందుకు మిల్లర్ల మెలిక
- కొనుగోలు కేంద్రాల్లో మొదలైన దోపిడీ



దండేపల్లి కొనుగోలు కేంద్రంలో 42కిలోల తూకం



జన్నారం ఐకేపీ కేంద్రంలో 42కిలోల తూకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ మొదలైంది. ధాన్యం సరిగా లేదని, తేమ సాకు చూపి బస్తాకు 42కిలోల చొప్పున తూకం వేస్తూ రైతులను ముంచేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభం కాగా, కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తున్నారు. ఇప్పటివరకు 11మిల్లులకు ట్యాగింగ్ ఇవ్వగా.. సుమారు 9వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు జరిగాయి. క్రమంగా కేంద్రాలకు ధాన్యం రావడం పెరుగుతుండడంతో మిల్లర్లు మెలిక పెడుతున్నారు. తూకంలో అధికంగా బరువు వేయొద్దని మిల్లర్లకు ముందే చెబుతున్నా ధాన్యం దించుకోబోమని రైతులతోనే చెబుతుండడంతో కేంద్రాల నిర్వాహకులు 42కిలోలు జోకుతున్నారు. నిబంధనల ప్రకారం 40కిలోలు తూకం వేయాలి. గన్నీ సంచితో మరో 500గ్రాములు కలిపి, మరో అర కిలో తరుగు చేర్చినా, మొత్తంగా 41కిలోలకు పరిమితం కావాలి. అయితే శుక్రవారం జన్నారం మండలంలో ఐకేపీ కేంద్రంలో 42కిలోలు, ప్రాథమిక సహకార సంఘం పరిధి కేంద్రంలో 41కిలోలు, దండేపల్లిలో 42కిలోల చొప్పున తూకం వేశారు. దీంతో రైతులు రైతులు గత్యంతరం లేక అమ్మేసుకుంటున్నారు. జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన ఓ రైతుకు తూకంలో అనుమానం వచ్చింది. దీంతో వేరే చోట బరువు చూస్తే బస్తాకు 42కిలోలు రావడంతో ఆయన కొనుగోలు నిలిపివేశాడు.

తేమ, శుభ్రత లేవనే సాకు

ఏటా ప్రతీ సీజన్‌లో మిల్లర్లు తేమ, శుభ్రత సాకుతో రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. నిబంధనల ప్రకారం 17శాతం లోపే తేమ ఉంటే మద్దతు ధర చెల్లించాలి. చాలా చోట్ల తేమ ఎక్కువగా ఉంటోంది. ఇక ధాన్యం శుభ్రం చేసే యంత్రాల(ప్యాడీ క్లీనర్లు)తో ధాన్యం శుభ్రం చేసుకునేందుకు చాలామంది రైతులు ముందుకు రావడం లేదు. కేంద్రానికి వెళ్లిన వెంటనే అమ్మేసుకోవాలనే వాతావరణ భయంతో, రైతుల తొందరపాటు మిల్లర్లకు కలిసి వస్తోంది. ఇందుకు నిర్వాహకులు సైతం సహకరిస్తూ ఆ మేరకు ట్రక్ షీట్లు, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో రైతులకు నష్టం జరుగుతోంది. జిల్లాలో 321 కేంద్రాల్లో 3.31లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ఉంది. ఇందులో ఒక కిలో చొప్పున రైతుల నుంచి కోత పెట్టినా రూ.కోట్లలోనే జిల్లా వ్యాప్తంగా రైతులు నష్టపోవాల్సి వస్తుంది. గతంలో చాలా కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టినా కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకోగా, ఇంకా ఈ సీజన్‌లోనూ ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారు.

41కిలోలే తూకం

జిల్లాలో ఐకేపీ కేంద్రాల్లో ఎక్కడా 42కిలోలు తూకం వేయడం లేదు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆ మేరకే తూకం వేయాలని ఆదేశాలిచ్చాం.

– కిషన్ జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

భూభారతితో సమస్యలు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లిరూరల్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూభారతి చట్టం రూపొందించారని, ఈ చట్టంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నాల రైతువేదికలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు భూమిపై పూర్తి స్థాయిలో హక్కులు లభిస్తాయని అన్నారు. ఎలాంటి సమస్యనైనా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడానికి వీలుందని తెలిపారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కలెక్టర్, అదనపు కలెక్టర్‌లను శాలువాలతో సన్మానించారు. అనంతరం బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధిలో సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో పి.హరికృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కారుకూరి రాంచందర్, పీఏసీఎస్ చైర్మన్ స్వామి, ఏడీఏ రాజానరేందర్, తహసీల్దార్ జ్యోత్స్న, నాయకులు మహేందర్, శ్రీనివాస్, స్వామి, అనిత, లక్ష్మీనారాయణ, మల్లయ్య పాల్గొన్నారు.



కన్నాల రైతువేదికలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

రైతులకు వరం..

తాండూర్: భూభారతి చట్టం రైతులకు వరమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సురభి గార్డెన్స్‌లో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టానికి రూపకల్పన చేసిందన్నారు. ఇంకా ఏమైనా లోటుపాట్లు ఉంటే సరి చేసి భవిష్యత్‌లో ఎలాంటి భూ సమస్యలు రాకుండా మరింత సమర్థవంతంగా చట్టాన్ని అమలు చేస్తామన్నారు. రైతులు, నాయకులు చేసిన సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ భూభారతి చట్టం, ప్రయోజనాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, డెప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సౌమ్య, కాంగ్రెస్ నాయకులు, న్యాయవాదులు హాజరయ్యారు.

ఆర్కే 7గని సింగరేణికే తలమానికం

- కంపెనీ డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్లు
- ఘనంగా గని స్వర్ణోత్సవాలు

శ్రీరాంపూర్: ఆర్కే 7 గని సాంకేతికతలో సింగరేణికే తలమానికమని సింగరేణి డైరెక్టర్లు అన్నారు. గని 50సంవత్సరాలు జీవిత కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు, డైరెక్టర్(పీపీ) కే.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలోనే మొట్టమొదట ఎస్‌డీఎల్ యంత్రాలను ఈ గనిలోనే ప్రవేశపెట్టామని తెలిపారు. మ్యాన్ రైడింగ్ యంత్రాలనూ ఇక్కడే ప్రవేశపెట్టామని, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, రక్షణ చర్యల్లో గనికి మంచి చరిత్ర ఉందని అన్నారు. కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేశారు. గనిపై మైసమ్మ ఆలయంలో హోమాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్, ఎస్టీపీపీ ఈడీ చిరంజీవులు, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం సుశాంత్ సాహూ, గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, బీఎంఎస్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీఐటీయూ ఉపాధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న కంపెనీ డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్లు

పోలీస్‌స్టేషన్‌లో సీపీ తనిఖీ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. సర్కిల్ పరిధిలోని రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. పోలీస్ ఆవరణ తిరిగి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

అగ్ని ప్రమాదంలో భారీ నష్టం

- నాలుగు ఫైరింజన్లతో అదుపులోకి వచ్చిన మంటలు
- రూ.2.95కోట్ల ఆస్తి నష్టం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీ రోడ్‌లో అనుముల సతీష్‌కుమార్‌కు చెందిన ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణంలో శుక్రవారం తెల్లవారు జామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఫైర్‌స్టేషన్ అధికారి రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం వేకువజామున 2గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకునేలోపు మంటలు చెలరేగాయి. ఒక్క ఫైరింజన్‌తో మంటలు ఆర్పడం సాధ్యం కాకపోవడంతో చెన్నూర్, బెల్లంపల్లి, గోదావరిఖని నుంచి మరో మూడు ఫైరింజన్లను రప్పించారు. ఉదయం 5గంటలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్లాస్టిక్, వ్యర్థాలు కావడం వల్ల మంటలు త్వరగా వ్యాపించాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ఫైర్‌స్టేషన్ అధికారి తెలిపారు. రూ.2కోట్ల 95లక్షల 77వేలు ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు.

మంచిర్యాలలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, కాంగ్రెస్ నాయకులు



ఉగ్రవాదులను ఉరి తీయండి

మంచిర్యాలటౌన్: జమ్మూకశ్మీర్ పహల్గాంలో భారతీయులపై దాడి చేసిన ఉగ్రవాదులను ఉరితీయాలని, దాడులకు పాల్పడి ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీజీఈజేఏసీ నివాళి



తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీఈజేఏసి) ఆధ్వర్యంలో పహల్గాంలో భారతీయులపై జరిగిన టెర్రరిస్టుల దాడికి నిరసనగా, మృతుల ఆత్మ శాంతించాలని టీఎన్జీవోస్ భవన్ నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ రాష్ట్ర నాయకులు పర్వతి సత్యనారాయణ, జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రెటరీ జనరల్ కే.వనజారెడ్డి, జిల్లా అడిషనల్ సెక్రెటరీ జనరల్ కె.శంకర్, కో చైర్మన్లు జి.చక్రపాణి, ఎల్.కృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, ఏ. సుభాష్, జి.సుమిత్, పి.సంజీవ్, ఏ.రమేశ్ పాల్గొన్నారు.

నిరసన.. నివాళులు



రామకృష్ణాపూర్: కశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాజీవ్‌చౌక్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, అక్బర్‌అలీ మాట్లాడుతూ అమాయక ప్రజలపై ఉగ్రవాదులు జరిపిన దాడి యావత్ దేశాన్ని కలిచివేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. బీజోన్‌లో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు యాకూబ్‌అలీ, మేరాజ్ మస్జిద్, బిలాల్ మస్జిద్, సలీమ్, పాషా తదితరులు పాల్గొన్నారు. కాగా సీపీఐ ఆధ్వర్యంలోనూ బీజోన్ రాజీవ్‌చౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదరి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వేతన వెతలు



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

- ఇబ్బందులు పడుతున్న ఉపాధి హామీ పథకం ఉద్యోగులు
- సాంకేతిక కారణాలంటూ అధికారుల కాలయాపన

పాతమంచిర్యాల: ''జనవరి నెల నుంచి జీతాలు రావడం లేదు. నెలనెలా కుటుంబం గడవడం కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. కిరాణ దుకాణాల్లో అరువుకు కూడా సరుకులు ఇవ్వడం లేదు..'' ఇదీ జిల్లాలోని ఉపాధి హామీ పథకం కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల ఆవేదన. వీరే కాదు ఏపీవోలు, ఈసీలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులదీ అదే పరిస్థితి. జిల్లాలోని ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగుల(టెక్నికల్ అసిస్టెంట్లు మినహాయించి)కు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. అసలే అరకొర జీతాలు కాగా.. అవీ సకాలంలో రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జీతాల విషయమై అధికారులను ప్రశ్నిస్తే సాంకేతిక కారణాల కారణంగా రావడం లేదని ప్రతీ నెల ఇదే సమాధానం చెబుతున్నారు. జిల్లాలో 16 మంది ఏపీవోలు, 16మంది ఈసీలు, 40మంది కంప్యూటరు ఆపరేటర్లు, 158మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 27 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఏపీవోలు, ఈసీలకు రూ.50వేల నుంచి రూ.54వేల వరకు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.24వేల నుంచి రూ.29 వేల వరకు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు వారి కేటగిరీలను బట్టి రూ.9వేల నుంచి రూ.12వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. గతంలో ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ఉపాధి హామీలో ఉన్నప్పుడు జీతాలు సక్రమంగా వచ్చేవి. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలో నిధులు జమ చేయడంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అనుసంధానకర్తగా ఏర్పాటు చేసిన స్పర్శ్ పోర్టల్ ద్వారా వేతనాలు అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ సాఫ్ట్‌వేర్‌లో వచ్చిన సాంకేతిక లోపాల కారణంగా వేతనాలు ఆలస్యమయ్యాయని అధికారులు చెబుతున్నారు. వేతనాల పెండింగ్ విషయమై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌ను సంప్రదించగా.. ఉద్యోగుల వివరాలు పంపించామని, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ఎదురుచూపులేనా..?

- డీఎస్సీ–2008 టీచర్ల ఇక్కట్లు
- ముగిసిన కాంట్రాక్టు గడువు

మంచిర్యాలఅర్బన్: పదహారేళ్లుగా ఎదురు చూసి ఉద్యోగం సాధించిన డీఎస్సీ–2008 టీచర్లకు కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి న్యాయం పోరాటం చేసి కొలువులు దక్కించుకున్నా రెండున్నర నెలలుగా వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఫిబ్రవరి 15న ఒప్పంద ప్రాతిపదికన ఎస్జీటీలుగా ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది. నెలకు రూ.31,040 గౌరవ వేతనంగా నిర్ణయించింది. జిల్లాలో 11మందికి వివిధ పాఠశాలలు కేటాయించారు. ఏప్రిల్ 23తో కాంట్రాక్టు గడువు ముగిసిపోయింది. పాఠశాలలకు సెలవులు రావడంతో వేతనాలు ఎప్పుడు వస్తాయోననే అయోమయం నెలకొంది.

పదిన్నర నెలలే ఉద్యోగం

డీఎస్సీ–2008 టీచర్లు కాంట్రాక్టు పద్ధతిన పదిన్నర నెలలు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 25న చేరిన టీచర్లకు మార్చి 1న, ఏప్రిల్ 1న కూడా వేతనాలు చెల్లించలేదు. ట్రెజరీలో అడిగితే తమకేమీ తెలియదని చెబుతున్నారని టీచర్లు వాపోతున్నారు. ఎంప్లాయి ఐడీతోపాటు జీతాల డ్రాయింగ్ అధికారి ఎవరో స్పష్టత లేకుండా పోయింది. దూరప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం వల్ల రవాణా చార్జీలు తడిసి మోపెడయ్యాయి. ఏప్రిల్ 23న తొలగించి జూన్ 12న తిరిగి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగంలోకి తీసుకుంటామనే నిబంధన టీచర్లకు ఇబ్బందిగా మారింది. పాఠశాల పునః ప్రారంభమయ్యే వరకు గౌరవ వేతనం రాదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. వేతనాల చెల్లింపుపై ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



నెలనెలా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. విధులకు హాజరయ్యేందుకు రవాణా ఖర్చులకు కూడా అప్పు చేయాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వేతనాలు ప్రతినెలా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

–ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్

నిధులు విడుదల చేయాలి



క్షేత్రస్థాయిలో కూలీలను పనులకు తీసుకెళ్లడం, అధికారులు నిర్ణయించిన లక్ష్యాల మేరకు కూలీలతో పనులు చేయిస్తూ ఉపాధి హామీ పథకం కోసం నిత్యం కష్ట పడుతున్నాం. జీతాలు రాకున్నా పనులకు ఆటంకాలు కలుగకుండా సాగుతున్నాయి. ఇంత కష్టాలు పడుతున్నా జీతాలు రావడం లేదు. ఉద్యోగుల కోసం ప్రత్యేక నిధులు వెచ్చించి జీతాలు చెల్లించాలి.

– ఈద లింగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు

క్లుప్తంగా

నంబర్ ప్లేట్లు మార్చితే చర్యలు

ఆదిలాబాద్: ఇతరుల వాహనాల నంబర్ ప్లేట్లు కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఓ ప్రకటనలో హెచ్చరించారు. నకిలీ నంబర్ ప్లేట్లు వాడుతున్న ఇద్దరిపై ఆదిలాబాద్ వన్‌టౌన్, బజార్‌హత్నూర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాథోడ్ సతీశ్ తన ద్విచక్ర వాహనానికి ట్రాఫిక్ చలాన్లు పడకూడదని బేలకు చెందిన ఓ వ్యక్తి కారు నంబర్‌తో తిరుగుతుండగా అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. బజార్‌హత్నూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సూర్యవంశీ ప్రకాశ్ వేరే వ్యక్తి వాహన నంబర్ ప్లేట్ తన వాహనానికి బిగించుకోగా, అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

సాయిచైతన్యకు స్వాగతం



శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానికులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని సేవదాస్‌నగర్‌కు చెందిన కానిస్టేబుల్ జాదవ్ గోవింద్‌రావు కుమారుడు సాయి చైతన్య యూపీఎస్సీలో 68వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. అతడు మొదటిసారి శుక్రవారం ఉట్నూర్‌కు రావడంతో ఆయనకు బంజారా పెద్దలు, పట్టణ వాసులతో పాటు, బంధు మిత్రులు పూలమాలలతో స్వాగతించారు. ఉట్నూర్ ఐబీ చౌరస్తా నుంచి సేవదాస్‌నగర్ వరకు డప్పు చప్పుళ్లతో ఇంటి వరకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, పట్టణవాసులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటితో బార్ల దరఖాస్తు గడువు పూర్తి

మంచిర్యాలక్రైం: జిల్లాలో రెన్యూవల్ చేసుకోకుండా రెండు బార్లు మూతపడగా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు స్వీకరణ గడువు శనివారం ముగియనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి కేజీ నందగోపాల్ తెలిపారు. శుక్రవారం వరకు మంచిర్యాల బార్‌కు ఐదు దరఖాస్తులు, బెల్లంపల్లి బార్‌కు ఒక్క దరఖాస్తు రావడం గమనార్హం. చివరిరోజు దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సాయంత్రం 5లోపు అందజేయాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఈ నెల 29న లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో నలుగురికి జైలు

భైంసాటౌన్: ఒకరిపై దాడికి పాల్పడిన కేసులో నలుగురికి ఏడాది జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ గోపీనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మదీనా కాలనీకి చెందిన అబ్దుల్ జబ్బార్‌పై ఓవైసీనగర్‌కు చెందిన షేక్ మైతాబ్, సల్మాన్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్‌తోపాటు మరొకరు 2019 జనవరిలో దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని ఫస్ట్ క్లాస్ కోర్టులో నేరం రుజువు కావడంతో, నిందితులు ముగ్గురికి ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి దేవేంద్రబాబు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

ఆరు వాహనాలు సీజ్

కైలాస్‌నగర్: సరుకు రవాణా చేసే వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలను రవాణాశాఖ అధికారులు సీజ్ చేశారు. రవాణాశాఖ అధికారి రవీందర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆరు వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ.. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తే చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పామాయిల్ తోటలో మంటలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంచపాయ వైపు చల్ల సుధాకర్‌రెడ్డికి చెందిన పామాయిల్ తోటలో మంటలు చెలరేగాయి. పామాయిల్ చేను పక్కనే ఉన్న తెలగరామన్న అనే కౌలు రైతు శుక్రవారం తన చేనులో ఎండిన పత్తి కట్టెకు నిప్పు పెట్టాడు. ప్రమాదవశాత్తు మంటలు గడ్డి వెంట పామాయిల్ తోటలోకి ప్రవేశించాయి. పామాయిల్ తోటలో ఉన్న గడ్డికి మంటలు అంటుకుని క్షణాల్లో చెలరేగాయి. తోటలోని పైపులైన్, ల్యాటర్స్, ఔట్‌లెట్, జెట్, డ్రిప్పర్లు కాలిపోయాయి. అక్కడే ఉన్న రైతులు, యువకులు మంటలు అదుపు చేశారు. ఈ మంటల్లో పామాయిల్ మొక్కలు కూడా ఆహుతయ్యాయి.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట: పట్టణంలోని ఆంధ్రబోర్‌కు చెందిన బొప్పు శ్రీనివాస్ ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు గురువారం పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లగా, శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి వెంకట్రావ్‌పేటలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులోని బట్టలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలోని రూ.50వేల విలువైన బంగారం చైన్, రింగు, చెవి కమ్మలతో పాటు రూ.10వేల విలువైన వెండి ఆభరణాలు, రూ.25వేల నగదు దోచుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

రజతోత్సవ సభకు


ఇలా వెళ్లొద్దాం..

బీఆర్‌ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. • జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్: మల్లంపల్లి–గుడెప్పాడ్–వంగపహాడ్–యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి–ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్: ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు–టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం–ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్: ధర్మసాగర్–దేవునూరు–దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్: కరీంనగర్, హుజూరాబాద్–కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్: సిద్దిపేట–ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్

సభ వివరాలు



మొత్తం సేకరించిన భూమి: **1,356** ఎకరాలు

సభావేదిక: **159** ఎకరాలు

పార్కింగ్ జోన్లు **5**

కేటాయించిన భూమి **1,179**

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

బాసర: ఆర్జీయూకేటీలో కాంట్రాక్ట్ లెక్చరర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదోరోజుకు చేరింది. శుక్రవారం బాసర రైల్వేస్టేషన్ వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహం ఎదుట మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం శ్రీకాంత్ శ్రీరామ్, శేఖర్, రజిత, భానుప్రియ, ప్రశాంతి, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లక్కపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామస్తులు శుక్రవారం చెన్నూర్–మంచిర్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. పంచాయతీలో 1,104 మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోగా 70మంది పేర్లు వచ్చాయని తెలిపారు. ఇందులో ఎల్లక్కపేటకు చెందిన ఆరుగురి పేర్లు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను అడిగితే పట్టించుకోవడంలేదని తెలిపారు. అధికారులు మళ్లీ సర్వే చేసి అర్హులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కొడుకును కడతేర్చిన తండ్రి

• ఆర్థిక గొడవలే కారణం



అశోక్ మృతదేహం

లక్ష్మణచాంద: ఆర్థిక గొడవల కారణంగా తండ్రి కొడుకును కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని మల్లాపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన బైనం ఎర్రన్న–గంగవ్వ దంపతులకు కుమారుడు అశోక్ (32), కూతురు ఉన్నారు. కూతురుకు వివాహమైంది. అశోక్‌కు వివాహం కాగా ఇద్దరు కూతుళ్లున్నారు. కాగా, తండ్రీకొడుకులు మద్యం సేవించి నిత్యం గొడవ పడేవారు. చంపుతా.. అంటే చంపుతా.. అని పరస్పరం హెచ్చరించుకునేవారు. తండ్రీకొడుకుల మధ్య గొడవ కారణంగా అశోక్ భార్య ఇద్దరు చిన్నారులతో ఆర్నెళ్ల క్రితం లక్ష్మణచాందలోని పుట్టింటికి వెళ్లింది. అశోక్ తరచూ వెళ్లి భార్య, పిల్లలను చూసి వస్తుండేవాడు. గురువారం మధ్యాహ్నం కూడా అశోక్ భార్య వద్దకు వెళ్లాడు. రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రోజులాగానే తండ్రితో గొడవ పడ్డాడు. నిత్యం గొడవలతో వేగలేకపోతున్నానని భావించిన ఎర్రన్న మద్యం మత్తులో ఉన్న కొడుకును చంపాలనుకున్నాడు. రాత్రి ఆరుబయట పడుకున్న అశోక్‌ను శుక్రవారం వేకువజామున గొడ్డలితో తల, ముఖంపై నరికాడు. తీవ్ర గాయాలతో అశోక్ అక్కడికక్కడే చనిపోయాడు. ఆ తర్వాత గొడ్డలిని సమీప పొలంలో పడేసిన ఎర్రన్న లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లి గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎర్రన్నను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపారు. అశోక్‌కు భార్య లక్ష్మి, ఏడేళ్ల కూతురు, ఎనిమిది నెలల పాప ఉన్నారు.

చెక్‌బౌన్స్‌కేసులో ఇద్దరికి జైలు

మంచిర్యాలక్రైం: మూడు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నిరోష శుక్రవారం తీర్పునిచ్చినట్లు కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఏసీసీ సుభాష్‌నగరకు చెందిన గుమ్ముల చంద్రశేఖర్ వద్ద రూ.5లక్షలు, మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన గుమ్ముల వెంకటేశ్వర్లు వద్ద రూ.3లక్షలు గద్దెరాగడికి చెందిన గుమ్ముల శ్రీనివాస్ తన అవసరం కోసం అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న సమయంలో చెక్కులు ఇచ్చాడు. గడువు ముగిసిన తర్వాత అప్పు తిరిగి చెల్లించక పోవడంతో చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు వేర్వేరుగా 2017లో కోర్టును ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న న్యాయస్థానం ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరం రుజువైనందున చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు వద్ద తీసుకున్న అప్పును చెల్లించడంతో పాటు రెండు కేసుల్లో వేర్వేరుగా ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఉపాధ్యాయురాలికి జైలు శిక్ష

చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయురాలికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మంచిర్యాలకు చెందిన ఎం.తిరుపతి వద్ద మంచిర్యాల ఏసీసీకి చెందిన బీ రజిత రూ.4లక్షలు అప్పుగా తీసుకుంది. ఇందుకు చెక్కులు అందజేసింది. గడువు ముగిసిన తర్వాత అప్పు చెల్లించక పోవడంతో తిరుపతి 2018లో కోర్టును ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న న్యాయస్థానం ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి నిరోష రజిత తీసుకున్న అప్పు చెల్లించడంతోపాటు ఆరునెలల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన ఎలిగేటి చంద్రయ్య–శాంత దంపతుల కుమారుడు నాగరాజు (30) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పని చేసేవాడు. గురువారం డ్యూటీకని వెళ్లిన నాగరాజు మంచిర్యాల–రవీందర్‌ఖని స్టేషన్ల మధ్య కుర్మపల్లి సమీపంలో తన ద్విచక్రవాహనాన్ని రైల్వే ట్రాక్ సమీపంలో పార్కింగ్ చేశాడు. అనంతరం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు నెలలుగా నాగరాజు మానసిక పరిస్థితి బాగాలేదు. అతడు గతంలో తన ద్విచక్రవాహనంపై మహారాష్ట్ర, వాంకిడి వైపు వెళ్లేవాడు. అతడి ఆరోగ్య పరిస్థితి బాగాలేకనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై తెలిపారు.

కారు, బైక్ ఢీకొని ఒకరు మృతి

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణంలోని ఆంధ్రబోర్ హర్ష హోటల్ ముందు బైక్, కారు ఢీకొని చెవుల రాజ లింగయ్య (62) మృతి చెందాడు. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన చెవుల రాజలింగయ్య శుక్రవారం ఉదయం లక్సెట్టిపేటలోని గాంధీనగర్‌లో ఉండే తన కూతురు ఇంటి నుంచి, ఆంధ్రబోర్‌లో ఉండే కుమారుడి ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. రాజలింగయ్యను లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి చిన్న కొడుకు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరంపై దాడి

బెజ్జూర్: గుడుంబా స్థావరంపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడి నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్వర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని లంబాడిగూడ (తండాలో నాటుసారా తయారు చేస్తుండగా దాడి చేసి 100 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. లంబాడిగూడకు చెందిన బానోత్ హరిప్రసాద్, నాగుత్ విజయ్ నాటుసారా తయారు చేస్తుండగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సలుగుపల్లి గ్రామానికి చెందిన అవధూత సత్యనారాయణ కిరాణా షాపులో దాడులు నిర్వహించి 75 కిలోల బెల్లం, 20 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది నవీన్, కృష్ణ, సాయి తదితరులున్నారు.

పేకాడుతూ 10మంది అరెస్ట్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుపెల్లి ఏరియాలోని పేకాటస్థావరంపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. 10 మొబైల్ ఫోన్లు, రూ.79,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఈ స్టేషన్‌లో రైళ్లు ఆగవు

• ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
• పక్క స్టేషన్లకు వెళ్లాలంటే ఆర్థిక భారం



మందమర్రి రైల్వే స్టేషన్

మందమర్రిరూరల్: సింగరేణి పారిశ్రామిక ప్రాంతం మందమర్రిలోని రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్టింగ్ కరువైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో స్థిరపడిన వివిధ ప్రాంతాల ఉద్యోగులు, వ్యాపారులు సొంతూళ్లకు, విద్యార్థులు చదువుల కోసం ఇతర పట్టణాలకు వెళ్లాలంటే పక్కనున్న బెల్లంపల్లి, రవీంద్రఖని, మంచిర్యాల రైల్వేస్టేషన్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రతీరోజు వందలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ఈ రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కరీంనగర్ పుష్‌పుల్ రైళ్లు తప్ప ఇతర రైళ్లు ఆగడం లేదు. గతంలో సింగరేణి, ప్యాసింజర్, రామగిరి, సిర్పూర్ కాగజ్‌నగర్(పాత తెలంగాణ) రైళ్లకు హాల్టింగ్ ఉండేది. కరోనా నుంచి రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేయగా ఇప్పటికీ పునరుద్ధరించలేదు.

కనీస సౌకర్యాలు కరువు

మందమర్రి రైల్వేస్టేషన్ నుంచి ప్రతీరోజు భాగ్యనగర్, ఇంటర్ సిటీ రైళ్ల ద్వారా వందలాది మంది ప్రయాణం సాగిస్తారు. రైల్వేస్టేషన్ ఆవరణలో మరుగుదొడ్డి, తాగునీరు, బెంచీలు, ఫ్యాన్లు తదితర కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారు జామున వచ్చే భాగ్యనగర్ రైలు ప్రయాణికులకు కొన్ని సమయాల్లో విద్యుత్ దీపాల సౌకర్యం లేక విష పురుగుల బాధ తప్పడం లేదు.

ఎంపీ చొరవ చూపాలి

మందమర్రి రైల్వేస్టేషన్‌లో గతంలో నిలిపివేసిన రైళ్ల హాల్టింగ్‌ను పునరుద్ధరించడంతోపాటు మరికొన్ని కొత్త రైళ్లు నిలిపే విధంగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు కూడా ఎంపీ హామీ ఇచ్చారు. ఇటీవల కేంద్రమంత్రితో మాట్లాడి కాజీపేట టు అజ్నీ ప్యాసింజర్ హాల్టింగ్‌కు కృషి చేశారు. తెలంగాణ రైలు, ఆంధ్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వెళ్లే మరికొన్ని కొత్త రైళ్లకు హాల్టింగ్ కల్పించే విధంగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



వినియోగంలో లేని మరుగుదొడ్డి

ప్రయాణానికి ఇబ్బంది



తెలంగాణ, సిర్పూర్ కాగజ్‌నగర్, తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా ప్రయాణించాలంటే పక్కనున్న బెల్లంపల్లి, రవీంద్రఖని, మంచిర్యాల రైల్వేస్టేషన్లను ఆశ్రయించక తప్పడం లేదు. దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి రావడంతో ఆర్థిక భారంతోపాటు సమయం వృథా అవుతోంది. మందమర్రి రైల్వేస్టేషన్‌లోనే రైళ్లు నిలిపితే ఇబ్బంది తప్పుతుంది.

– అబ్బాస్, మందమర్రి

జీవనోపాధికి తిప్పలు



మందమర్రి రైల్వేస్టేషన్‌లో గతంలో పలు రైళ్లకు హాల్టింగ్ ఉన్నప్పుడు కనీసం 30నుంచి 40 మంది ఆటోడ్రైవర్లకు రోజుకు రూ.500 నుంచి రూ.600 వచ్చేది. భాగ్యనగర్, తెలంగాణ రైళ్లకు మాత్రమే హాల్టింగ్ ఉండడం వల్ల జీవనోపాధికి తిప్పలు తప్పడం లేదు. అన్ని రైళ్లకు గతంలో మాదిరిగా హాల్టింగ్ ఉన్నట్లయితే ఆటో డ్రైవర్లకు జీవనోపాధి లభిస్తుంది.

– బెంజిమెన్ ఆటో డ్రైవర్, మందమర్రి

వివాహితపై లైంగికదాడి

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామానికి చెందిన యువకుడు సునీల్‌పై శుక్రవారం అత్యాచారం కేసు నమోదైనట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత ఉదయం 11 గంటల సమయంలో గ్రామ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లింది. అక్కడే ఉన్న సునీల్ ఆమెను వంతెన పైపులోకి లాక్కెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. గాయాలతో ఇంటికి చేరుకున్న బాధితురాలు భర్తకు విషయం తెలిపింది. అనంతరం తానూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు. బాధితురాలిని చికిత్స కోసం భైంసా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆత్మస్థైర్యంతో విధులు నిర్వర్తించాలి



మాక్ ఆపరేషన్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న భాస్కర్

చెన్నూర్: ఆత్మస్థైర్యంతో విధులు నిర్వర్తించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సంఘ విద్రోహ శక్తులు గుంపులుగా ఏర్పడి గొడవలు సృష్టించే సమయంలో ఎలా చెదరగొట్టాలో మాక్ ఆపరేషన్ డ్రిల్ నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలతో మమేకమై స్నేహపూర్వక వాతావరణంలో పని చేయాలని సూచించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ దేవేందర్‌రావు, ఎస్సైలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

వన్యప్రాణుల కోసం నీటి కుంటల నిర్మాణం



నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది

జైపూర్: ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్లాంటేషన్, అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి నీటి కుంటలు నిర్మిస్తున్నట్లు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీ ఎఫ్‌డీసీ) మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కాన్కూర్ గ్రామ సమీపంలోగల టీజీఎఫ్‌డీసీ నీలగిరి ప్లాంటేషన్‌లో శుక్రవారం నీటి కుంట తవ్వించారు. ఈజీఎస్ కింద చేపట్టిన ఈ పనులను శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండలు తీవ్రమై నీటి కోసం వన్యప్రాణులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నీటి ఊటలున్న ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. నీరు నిల్వ ఉండేలా నీటి కుంటలు తవ్విస్తున్నట్లు పేర్కొన్నారు. కాన్కూర్, ముదిగుంట అటవీ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్లాంటేషన్ వాచర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిప్పంటుకుని జొన్న పంట దగ్ధం



మంటల్లో కాలిపోతున్న జొన్న పంట



దగ్ధమైన పంటను పరిశీలిస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన రైతు మర్రిపెద్ద భోజన్నకు చెందిన నూర్పిడికి సిద్ధంగా ఉన్న జొన్న పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. భోజన్న ఎకరం జొన్న పంటను కోయించి పొలంలోనే ఆరబెట్టాడు. ఉదయం 11గంటలకు పొలం వద్దకు వెళ్లి ఎండ ఎక్కువ కావడంతో ఇంటికి వెళ్లాడు. సాయంత్రం మరోసారి పొలానికి వెళ్లి చూడగా అప్పటికే జొన్న పంటకు నిప్పంటుకుంది. గమనించి తోటిరైతుల సహాయంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశాడు. జిల్లాకేంద్రంలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఫైర్ ఇంజన్ ఆలస్యంగా చేరడంతో అప్పటికే ఎకరం జొన్న పంట అగ్నికి ఆహుతైంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే కాలిపోగా భోజన్న బోరున విలపించాడు. సుమారు రూ.75 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

ముధోల్ మండలం ఆష్టలో..

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన రైతు రవి లింగారెడ్డికి చెందిన నాలుగెకరాల మొక్కజొన్న పంట శుక్రవారం షార్ట్‌షర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వారం క్రితం లింగారెడ్డి మొక్కజొన్నను కోసి చేనులోనే ఆరబెట్టాడు. తన పొలం మీదుగా విద్యుత్ లైన్ ఉండగా మధ్యాహ్నం ఈదురు గాలులు వీచాయి. తీగలు ఒకదానికొకటి రాసుకోగా నిప్పు రవ్వలు ఎగిసిపడి మొక్కజొన్న పంట మీద పడగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో నాలుగెకరాల పంట పూర్తిగా దగ్ధమైందని బాధితుడు తెలిపాడు. రెవెన్యూ అధికారులు నారాయణ్‌పటేల్, సరస్వతీ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదించి పరిహారం అందేలా చూస్తామని తెలిపారు.

కంటికి ఆహారం... వ్యాయామం

మన శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో కంటికి కూడా అంతే అవసరం. రోజూ కొద్ది సేపు ఈ కంటి వ్యాయామాలు చెయ్యడం వలన కంటి చూపు వృద్ధి చెందుతుంది. దీనికి ప్రత్యేకంగా సమయం కేటాయించవలసిన అవసరం లేదు. ఎప్పుడు.. ఎక్కడ... ఎలా వీలయితే అలా సులువుగా చేసుకోవచ్చు. ఏం లేదు... పైకి, కిందికీ, పక్కలకూ కళ్ళను కదుపుతూ కొంతసేపు కంటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది.

అలాగే కంటికి మంచి చేసే ఆహారం కూడా ఉంది. ఆకుకూరల్లో కరివేపాకు, పొన్నగంటి, మెంతికూర, తోటకూర కంటిచూపును కాపాడుకోవడానికి దోహదం చేస్తాయి. పండ్లలో



బొప్పాయి, మామిడి, ఉసిరి మంచిది. అలాగే క్యారట్, కోడిగుడ్డు, పాలు కంటికి మేలు చేస్తాయి.

20-20-20

ఎక్కువగా కంప్యూటర్ ముందు పని చేసేవారికి కళ్లు బాగా అలసటకు గురవుతాయి. అలాంటివారు ఈ 20-20-20 రూల్ ని పాటించాలి. అది వెరీ సింపుల్. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి బ్రేక్ తీసుకుని కంప్యూటర్‌ని కాకుండా 20 మీటర్ల దూరంలో ఉన్న ఏదైనా వస్తువుని 20 సెకన్ల పాటు చూడండి. ఇదే 20-20-20 రూల్. అలాగే కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల కళ్ళు దెబ్బతినకుండా ఉండడం కోసం యాంటీ గ్లేర్ గ్లాసెస్‌ను ఉపయోగించండి.

ఇంతవరకూ ఏ సమస్యలూ లేకపోతే ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటిపరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే కళ్లజోడు వాడుతున్నవారయితే ఏడాదికి రెండు సార్లు విధిగా కంటిపరీక్షలు చేయించుకోవడం మంచిది.

పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, మంచి ఆహారం తీసుకోవడం వల్ల కంటి వ్యాధులు ఉన్నవారికి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. ఏ వ్యాధీ లేనివారు భవిష్యత్తులో కంటి జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చు.

పారేయకండి... పదును పెట్టండి



వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, న్యూస్ పేపర్లు, పనికిరాని ఇతర గృహోపకరణాలను బుర్రకు కాస్త పదును పెడితే చాలు... కళాఖండాలుగా తయారు చేయచ్చు. ఈ వేసవి సెలవల్లో పిల్లలకు దీనిపై కాస్తంత ఐడియా ఇస్తే చాలు... ఆనక వాళ్లే అల్లుకు పోతారు. వీటితో సృజనాత్మకత పెరగడమే కాదు.. కుదురు వస్తుంది. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతెలుస్తుంది. వనరుల పరిరక్షణ, రీసైక్లింగ్ ప్రాముఖ్యత తెలిసొస్తాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఒకసారి వాడి పడేసే కార్టన్‌లను ఆహ్లాదకరమైన జంతువుల ఆకారాలుగా మార్చవచ్చు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంచడానికి దోహదపడుతుంది. ఇందుకోసం పిల్లలను వారికి ఇష్టమైన జంతువు లేదా పక్షుల గురించి అడిగి, వాటి ఆకారాలను కాగితంపై ఔట్‌లైన్ గీయడం ద్వారా ప్రారంభించవచ్చు.

కావలసినవి: **ఖాళీ కార్టన్లు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, గమ్, గూగ్లీ కళ్ళు, పైప్ క్లీనర్లు.**

ఆలోచనకు తగ్గట్టు కార్టన్‌ను వివిధ ఆకారాలుగా కత్తిరించుకుని వారికి ఇష్టమైన రంగులలో పెయింట్ చేయనివ్వండి. రంగులు కలిపి నమూనాలను రూపొందించడానికి వారికే అవకాశం ఇవ్వడం మంచిది.

అలంకరణ: రంగు ఆరిన తర్వాత, గూగ్లీ కళ్ళపై జిగురు వేయండి. మార్కర్ల సాయంతో ముఖంలో ఇతర భాగాలను లేదా నమూనాలను గీయండి. పైప్ క్లీనర్లతో కాళ్ళు, యాంటెన్నా లేదా తోకలుగా చేసి చిన్న రంధ్రాలు చేసి దారంతో అటాచ్ చేయండి.





టాయిలెట్ పేపర్ రోల్ బైనాక్యులర్లు.. ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్‌ను బైనాక్యులర్లుగా మార్చుకోండి,

కావలసినవి: **రెండు ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్, నూలు లేదా రిబ్బన్, యాక్రిలిక్ పెయింట్ బ్రష్‌లు, గమ్, స్టిక్కర్లు, డెకరేషన్లు.**

పెయింటింగ్: పిల్లలను టాయిలెట్ పేపర్ రోల్స్‌కు పెయింట్ వేయమని చెప్పి, వాటిని పూర్తిగా ఆరిన తర్వాత పక్కపక్కనే అతికించండి. గ్లూ గట్టి పడగానే మెడ పట్టీకోసం రెండువైపులా నూలు లేదా రిబ్బన్‌ముక్కను అటాచ్ చేయండి. వీటికి స్టిక్కర్లు, మార్కర్లు, ఇతర అలంకరణలతో డెకరేట్ చేయండి. అలా తయారైన బైనాక్యులర్లతో సరదాగా బయటి ప్రదేశాలను చూడమని చెప్పండి.



బాటిల్ క్యాప్ అయస్కాంతాలు...

పాత బాటిల్ మూతలను అయస్కాంతాలుగా మార్చండి. వీటితో మీ రెఫ్రిజిరేటర్‌ను అందంగా అలంకరించండి.

కావలసినవి: **మెటల్ బాటిల్ మూతలు, చిన్న గుండ్రని అయస్కాంతాలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, పూసలు, బటన్లు, సీక్విన్, గ్లూ**

తయారీ: బాటిల్ మూత లోపల, వెలుపల బ్రైట్ కలర్స్ తో పెయింట్ చేయండి.ఆరిన తర్వాత క్యాప్‌ల లోపల చిన్న పూసలు, బటన్లు లేదా గవ్వలను అతికించండి. గ్లూ లేదా మంచి గమ్‌తో ప్రతి బాటిల్ మూత వెనుక భాగంలో ఒక చిన్న గుండ్రని అయస్కాంతాన్ని అటాచ్ చేయండి. ఇలా తయారైన వాటితో రిఫ్రిజిరేటర్‌పై కళాకృతులు, నోటీసులు లేదా ఫోటోలను ప్రదర్శించండి.



ప్లాస్టిక్ బాటిల్ ప్లాంటర్లు...

ప్లాస్టిక్ బాటిళ్లను అందమైన ప్లాంటర్‌లుగా తిరిగి ఉపయోగించవచ్చు, పిల్లలకు రీసైక్లింగ్, తోటపని నేర్పచ్చు.

కావలసినవి: **ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, కత్తెర, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, మట్టి, చిన్న మొక్కలు లేదా విత్తనాలు.**

తయారీ: ప్లాస్టిక్ బాటిళ్లను సగానికి కట్ చేసి, పైభాగాన్ని పారవేయండి. సీసాల దిగువ భాగాలను రంగులతో అలంకరించండి. ఇలా అలంకరించిన సీసాలను మట్టితో నింపి వాటిలో విత్తనాలు లేదా చిన్న మొక్కలను నాటండి. వీటిని ఎండ పడే ప్రదేశంలో ఉంచి, రోజూ నీరు పెట్టండి.

వార్తాపత్రిక కోల్లేజ్ కళ...

పాత వార్తాపత్రికలను కథను చెప్పే అద్భుతమైన కొల్లేజ్ కళాఖండాలుగా మార్చండి

కావలసినవి: **పాత వార్తాపత్రికలు, కత్తెర గ్లూ స్టిక్, కాగితం లేదా కాన్వాస్, మార్కర్లు**

తయారీ: వార్తాపత్రికల నుంచి ఆసక్తికరమైన చిత్రాలు, ముఖ్యాంశాలు, ఇతర న్యూస్‌ను కత్తిరించండి. కొల్లేజ్ సృష్టించడానికి కటౌట్ లను కాగితం లేదా కాన్వాస్‌పై అమర్చండి. విభిన్న లే ఔట్‌లు, థీమ్‌లతో ప్రయోగం చేయండి. తర్వాత, ఈ ముక్కలను అతికించండి. మార్కర్‌లు లేదా రంగు పెన్సిళ్లతో కొల్లేజ్‌కు నేపథ్యాలను జోడించండి. ఇలా తయారైన కోల్లైజ్‌ను కనిపించేలా వేలాడదీయండి.



సీడీ సన్ క్యాచర్లు...

పాత సీడీలకు మిరుమిట్లు గొలిపే సన్ క్యాచర్లుగా కొత్త జీవం పోయవచ్చు,

కావలసినవి: **పాత సీడీలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్లు, క్రాఫ్ట్ జిగురు, స్ట్రింగ్ లేదా రిబ్బన్, పూసలు, ఇతర డెకరేషన్‌లు.**

తయారీ: రంగురంగుల డిజైన్లు, నమూనాలు లేదా అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌తో సీడీలు మెరిసే వైపు పెయింట్ చేయండి. అంచుల చుట్టూ లేదా మధ్యలో పూసలతో అలంకరించి వాటిని సీడీ మధ్యలో ఉన్న రంధ్రం ద్వారా దారంతో అతికించండి. వీటిని ఎండ పడే కిటికీలో వేలాడదీస్తే అందమైన కాంతులు వెదజల్లుతాయి.

న్యూస్ పేపర్లతో ఫోటో ఫ్రేమ్...

కొన్ని పాత న్యూస్‌పేపర్లను తీసుకొని ప్రతి షీట్‌ను ముక్కలుగా చింపివేయండి. ఇప్పుడు, వార్తాపత్రికను ఒక మూల నుండి చుట్టడం ద్వారా సన్నని రోల్స్ తయారు చేయండి. రోల్‌ను భద్రపరచడానికి వార్తాపత్రిక అంచుని అతికించండి.

ఇప్పుడు మీకు కావలసిన ఏ పరిమాణంలోనైనా కార్డ్ బోర్డ్ ముక్కను తీసుకోండి. మీరు ఫ్రేమ్ చేయాలనుకుంటున్న ఛాయాచిత్రాన్ని ఫ్రేమ్ మధ్యలో ఉంచి, దాని రూపురేఖలను గీయండి. వార్తాపత్రిక రోల్స్‌ను అవుట్‌లైన్‌లపై అతికిస్తూ నాలుగు వైపులా కవర్ చేయండి. అదనపు వార్తాపత్రికను కత్తిరించండి. ఫ్రేమ్‌కు మీకు నచ్చిన ఏ రంగునైనా పెయింట్ చేసి ఫోటోగ్రాఫ్‌ను అతికిస్తే సరి.. మీ ఫోటో ఫ్రేమ్ రెడీ!

పిల్లల చేత ఇలాంటి వాటిని తయారు చేయిస్తే వారికి మంచి కాలక్షేపం అవుతుంది.

పాత ప్లాస్టిక్ సీసాలు, మెటల్ సీసా మూతలు, పెరుగు కుండలు, స్ట్రాలు, ప్యాకేజింగ్ వంటి శుభ్రమైన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించండి. తర్వాత, ఇంట్లో 'రీసైకిల్డ్ ఆర్ట్ స్టేషన్'ని సృష్టించండి. జిగురు, మార్కర్లు, పెయింట్, కత్తెర, ఇతర క్రాఫ్టింగ్ మెటీరియల్‌ను ఇచ్చి పిల్లలకు ఒక సవాలు ఇవ్వండి, వారు ప్లాస్టిక్ బాటిల్‌ను బర్డ్ ఫీడర్‌గా మార్చగలరా? ఆ పెరుగు కుండ పూల కుండగా మారగలదా? లేదా ప్లాస్టిక్ మూతలన్నీ కలబబోసుకుని రోబోట్ శిల్పంగా మారతాయేమో చూద్దాం!

● యోగా

మానసిక శక్తిని పెంచే శ్వాస

నాసిక రంధ్రాల ద్వారా శ్వాసను లోపలికి తీసుకుంటూ, తిరిగి వదులుతూ చేసే ప్రాణాయామ పద్ధతులలో ముఖ్యమైనవి నాలుగు ఉన్నాయి. వాటిలో..

కపాలభాతి: ఈ ప్రాణాయామంలో వేగంగా ఊపిరి తీసుకోవడం, వదలడం ఉంటుంది. ఈ విధానం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. శ్వాసకోశ కండరాలు బలోపేతం అవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీని వల్ల చేసే పనిపైన శ్రద్ధ, సృజనాత్మకత పెరుగుతుంది. ఒక ప్రశాంతమైన స్థలంలో సుఖాసనంలో కూర్చొని, ముక్కు ద్వారా శ్వాస పీల్చుతూ, వదులుతూ ఉండాలి.



భస్త్రిక: ఈ ప్రాణాయామం ద్వారా శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచవచ్చు. నోటిద్వారా శ్వాసను తీసుకొని, నోటిద్వారా వదలాలి. ఈ ప్రక్రియను పది-పదిహేను సార్లు పదే పదే చేయాలి.

భ్రామరి: ఈ ప్రాణాయామం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నోటితో తేనెటీగ లాగ హమ్ చేస్తూ .. నాసిక రంధ్రాల ద్వారా గాలి పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి.

ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యులను సంప్రదించి, నిపుణుల సలహాతో వీటిని సాధన చేయడం వల్ల మెరుగైన ఫలితాలను పొందుతారు.

సాక్షి సినిమా

ఆధ్యాత్మిక గురువు రవిశంకర్‌గా విక్రాంత్

● కొలంబియా అంతర్యుద్ధం ప్రధానాంశంగా 'వైట్'



● విక్రాంత్

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ జీవితం వెండితెర పైకి రానుంది. రవిశంకర్ జీవితంతో సినిమా రానుందని ఎప్పట్నుంచో ఓ వార్త ప్రచారంలో ఉంది. బాలీవుడ్ దర్శక-నిర్మాతలు సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు కూడా టాక్ వినిపించింది. ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రను విక్రాంత్ మాస్సీ చేయనున్నారనే ఊహాగానాలూ నెలకొన్నాయి. అందుకు తగ్గట్టు గత ఏడాది రవిశంకర్‌ని కలిశారు విక్రాంత్. ఆయన పాత్రలో ఒదిగిపోవడానికి కావాల్సిన సలహాలు, సూచనలు తీసుకున్నారట. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ని జూలైలో ఆరంభించాలనుకుంటున్నారన్నది తాజా సమాచారం. 'వైట్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి యాడ్ ఫిల్మ్ మేకర్ మాంటూ బస్సీ దర్శకత్వం వహించనున్నారు. కొలంబియాలో జరిగిన అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో రవిశంకర్ ఏ విధంగా కీలక పాత్ర పోషించారనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రలో ఒదిగిపోవడానికి విక్రాంత్ మాస్సీ మేకోవర్ అవుతున్నారు. హిందీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించి, పలు భాషల్లో అనువదించి, రిలీజ్ చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది 'వైట్' విడుదల కానుంది.

వారం ముందుగానే...



● టామ్ క్రూజ్

హాలీవుడ్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందులోనూ ఇండియాలో అద్భుతమైన ఆదరణ ఉంటుంది. తాజాగా భారతదేశంలో విడుదల కానున్న మరో క్రేజీ హాలీవుడ్ మూవీ 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్'. టామ్ క్రూజ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఇండియాలో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో మే 23న విడుదల కావాల్సి ఉంది. అయితే వారం ముందుగానే మే 17న ఈ చిత్రాన్ని ఇండియాలో రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు మేకర్స్. ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీలో భాగంగా ఎనిమిదో చిత్రంగా 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్' రూపొందింది.



ఆ అనుబంధానికి పేరు పెట్టలేను! - సమంత

''జీవితంలో మనం తీసుకునే ఒక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా నిర్ణయిస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసీ తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి'' అని సమంత అన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఇటీవల నిర్వహించిన 'గోల్డెన్ క్వీన్' పురస్కారాల్లో' గోల్డెన్ క్వీన్ అవార్డు అందుకున్నారు సమంత. అనంతరం ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. నా అదృష్టంతో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానం సంపాదించుకోవడానికి కారణం అయింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను'' అని చెప్పారు సమంత. ఇంకా తన వ్యక్తిగత జీవితం గురించి ఆమె మాట్లాడుతూ- ''నా ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ రవీంద్రన్ (నటుడు, దర్శకుడు) ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. ఫ్రెండా? సోదరుడా? కుటుంబ సభ్యుడా? రక్త సంబంధీకుడా? అనేది చెప్పలేను'' అన్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.

తన కోసమే నా పొగరే అణిగేనా...



● నాని

నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్' యూనివర్స్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే...' అంటూ సాగే మూడో పాటని శుక్రవారం విడుదల చేశారు. రాఘవ్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం విశేషం. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా, తన కోసమే నా పరుగే ఇక ఆగేనా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''హిట్: ది థర్డ్ కేస్' సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమ వెల్లువ, అభీ బార్ అర్జున్ సర్కార్...' పాటలకు మంచి స్పందన వచ్చింది. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా...' పాట కూడా ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

హ్యాట్రిక్ హిట్ కావడం ఆనందంగా ఉంది

- ఇంద్రగంటి మోహనకృష్ణ



● రూప, ప్రియదర్శి, మోహనకృష్ణ, తనికెళ్ల భరణి, శివలెంక కృష్ణప్రసాద్

''శివలెంక కృష్ణప్రసాద్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'జెంటిల్ మ్యాన్, సమ్మోహనం' చిత్రాలు హిట్ అయ్యాయి. మా కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం' హ్యాట్రిక్ హిట్ అయినందుకు హ్యాపీగా ఉంది. సినిమా బాగుందని ఎంతో మంది ఫోన్ చేస్తున్నారు... మెసేజ్‌లు చేస్తున్నారు. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా రూపొందిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ- ''ఈ రోజు మా టీమ్ గెలిచిందంటే నేనూ గెలిచాను. సినిమా గెలిచింది... మేం గెలిచాం'' అని చెప్పారు. ''మా సినిమా ప్రభంజనం ఇప్పుడే ప్రారంభం అయింది'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''చాలా రోజుల తర్వాత థియేటర్‌లో అందరూ పగలబడి నవ్వుతున్నారు. నవ్వులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది'' అని తనికెళ్ల భరణి పేర్కొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌లో నటులు అవసరాల శ్రీనివాస్, వడ్లమాని శ్రీనివాస్, కెమెరామేన్ పీజీ విందా, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం కరువైతే...



● శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్

''కలియుగమ్ 2064' సినిమా ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఫొటోగ్రఫీ, క్యారెక్టర్స్ డిజైన్, ఆర్టిస్టుల నటన... ఇలా అన్నీ ఒక మోడ్రన్ కైండ్ ఆఫ్ బుక్ చదివిన అనుభూతినిచ్చాయి. ఈ సినిమాని అందరూ థియేటర్లలో తప్పకుండా చూడండి'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'కలియుగమ్ 2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కిశోర్ కీలక పాత్ర పోషించారు. కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం మే 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేయనుంది. ఈ సినిమా ట్రైలర్‌ని రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్ అండ్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. 2064లో ఆహారం, నీరు, మానవత్వం అనేవి కరువైనప్పుడు విచక్షణా జ్ఞానం కోల్పోయిన మనుషులు ఎలాంటి ఘోరాలకి పాల్పడ్డారు? అనే థీమ్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

అమెరికన్ ప్రెసిడెంటా... మజాకా...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం జీ 20 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా దర్శకుని ఊహ అనేది ప్రేక్షకుల ఊహకందకపోతే అప్పుడు ఆ సినిమా పండుతుంది. ముఖ్యంగా హాలీవుడ్ దర్శకుల ఆలోచనలే వేరు. ఏది అసాధ్యమో, ఏదైతే జరగదు అని ప్రేక్షకులు అనుకుంటారో దాన్నే సినిమాలో చూపిస్తుంటారు హాలీవుడ్ డైరెక్టర్స్. హాలీవుడ్ దర్శకుడు పాట్రిసియా రీగెన్ తీసిన 'జీ 20' సినిమా ఆ కోవలోకి చెందినదే. ఒక్కసారి ఊహించండి... ప్రపంచంలోనే ఉత్తమోత్తమ సురక్షితమైన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు అనే విషయం మనకు తెలుసు. మరి... ఆ అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తిని తన కుటుంబంతో పాటు బందీలుగా తీసుకుని ప్రపంచాన్ని శాసిద్దామనుకున్న విలన్‌ను అమెరికా ప్రెసిడెంట్ ఎలా ఎదుర్కొన్నారో ఈ 'జీ 20'లో చూడవచ్చు. అది కూడా అమెరికన్ ప్రెసిడెంట్‌ను, అతని కుటుంబాన్ని బందీలుగా చేసుకోవడం కూడా చిన్న వేదిక మీదైతే కాదు, దాదాపు అరడజను దేశాధినేతలతో పాటు జీ 20 శిఖరాగ్ర సమావేశంలో హై సెక్యూరిటీ నడుమ ఉండగా అమెరికన్ ప్రెసిడెంట్‌తో పాటు అక్కడున్న మిగతా దేశాధినేతలందరినీ బందీలుగా చేసుకుంటాడు విలన్. ఇక్కడ ఈ సినిమా దర్శకుడు ఇంకా వినూత్నంగా ఆలోచించాడు. బందీలుగా ఉన్న తన కుటుంబాన్ని, ఇతర దేశాధినేతలను కూడా విలన్‌తో పోరాడి విడిపించే బాధ్యత ప్రెసిడెంట్ మీదే పెట్టాడు సదరు సినిమా డైరెక్టర్. 'జీ 20' సినిమా మంచి ఉత్కంఠతతో ప్రారంభమై, ఆద్యంతం ప్రేక్షకుడిని ఉగ్రూతలూగిస్తుంది. ముఖ్యంగా అమెరికన్ ప్రెసిడెంట్ పోరాట సన్నివేశాలు సినిమాకే హైలెట్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ సినిమాలో అమెరికన్ ప్రెసిడెంట్ కుంగ్ ఫూ ఫైటర్, గన్ షూటర్, అలాగే హెలికాప్టర్ రైడర్ కూడా. ఇక మరో పెద్ద ట్విస్ట్ ఏంటంటే సదరు అమెరికన్ ప్రెసిడెంట్ ఈ సినిమాలో ఓ లేడీ. ఈ పాత్రలో డేనియల్ సట్టన్ సూపర్‌గా నటించారు. పైన చెప్పుకున్నట్టు ఓ లేడీ అమెరికన్ ప్రెసిడెంట్ తన కుటుంబంతో పాటు ఇతర దేశాధినేతలను సూపర్ ఫైటింగ్ స్కిల్స్‌తో సేవ్ చేయడమనేది మామూలు కాన్సెప్టా... ఆలోచించండి. దటీజ్ 'జీ 20'. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. అయితే మీ పిల్లలను ఈ సినిమాకి దూరంగా ఉంచి మీరు మాత్రం వాచ్ ఇట్ ఫర్ వీకెండ్



- హరికృష్ణ ఇంటూరు